సాక్షి ఖమ్మం

సోమవారం । 23 । జూన్ । 2025



ఇక నిశ్చింతగా ఉండేలా..

గురుకుల విద్యార్థులకు ఉచిత విద్య, వసతి సౌకర్యంతో పాటు తల్లిదండ్రులతో మాట్లాడేందుకు ఫోన్ సౌకర్యం కూడా కల్పించారు. 8లో



.. విస్తరణకు చిక్కుముడి

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం అభివృద్ధికి చేపట్టిన మాఢవీధుల విస్తరణ పనులకు అడ్డు తొలగడం లేదు. 8లో

గరిష్టం / కనిష్టం 36° / 27°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలి గాలులు వీయడంతో పాటు పలు ప్రాంతాల్లో జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దూరవిద్యలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్ : కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (గత ఎస్‌డీఎల్‌సీఈ)లో 2025–26లో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ టి.గోపి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూలై 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. బీఏ, బీకాం జనరల్, కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ మ్యాథ్స్, లైబ్రరీ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పీజీలోని వివిధ కోర్సులకు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు అధ్యయన కేంద్రం లేదా 80088 11998 నంబర్‌లో కానీ సంప్రదించాలని సూచించారు.

రైతు భరోసా రూ.373.82 కోట్లు జమ

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం పంటల పెట్టుబడి సాయం నగదు జమ ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో రైతు భరోసా పథకం కింద మొత్తం 3,53,794 మంది రైతులు అర్హులు ఉండగా, వారికి గల సాగు భూమి ఆధారంగా రూ. 436,84,65,365 ఆయా రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు 3,26,349 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 373,82,71,666 జమ చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.


పలుచోట్ల ఓ మోస్తరు వర్షం

ఖమ్మంవ్యవసాయం : జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఓ మోస్తరు వర్షపాతం నమోదైంది. నేలకొండపల్లి మినహా మిగిలిన అన్ని మండలాల్లో వర్షం కురిసింది. జిల్లా సగటు వర్షపాతం 14.2 మి.మీ. నమోదు కాగా అత్యధికంగా తల్లాడ మండలంలో 57.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. కొణిజర్లలో 38.4, సత్తుపల్లి 32.6, పెనుబల్లిలో 30.2, ఖమ్మం రూరల్‌లో 25.8, వైరా 25.2, వేంసూరు 19.6, ఖమ్మం అర్బన్ 18.6, ఏన్కూరు 13.0, ముదిగొండలో 8.2, కామేపల్లిలో 6.6, కూసుమంచిలో 5.6, కల్లూరు, బోనకల్‌లో 4.2, రఘునాథపాలెంలో 3.0, సింగరేణిలో 2.0, తిరుమలాయపాలెంలో 1.8, ఎర్రుపాలెం 1.0, మధిర 0.8, చింతకాని 0.4, మి.మీ. వర్షపాతం నమోదైంది. అయితే ఈ వర్షం విత్తనాలు వేసేందుకు అంతగా అనుకూలంగా లేదని రైతులు అంటున్నారు. 60 మి.మీ. వర్షపాతం నమోదైతే పత్తి విత్తనాలు వేసే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

నేడు ఒలింపిక్ డే రన్

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా యువజన, క్రీడల శాఖ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యాన సోమవారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం నుంచి ఉదయం 6.30 గంటలకు ఒలింపిక్ డే రన్ ప్రారంభం అవుతుందని డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు పుట్టా శంకరయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారొక ప్రకటన విడుదల చేశారు. సర్దార్ పటేల్ స్టేడియం నుంచి లకారం ట్యాంక్ బండ్ వరకు కొనసాగే ఈ రన్‌లో క్రీడా సంఘాల బాధ్యులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొనాలని వారు కోరారు.

సాఫీగా సాగేదెలా?



కొణిజర్ల మండల పరిధిలో సాగర్ కాల్వలో పెరిగిన కంపచెట్లు

మరమ్మతులకు నోచుకోని సాగర్ కాల్వలు

- నీటి సరఫరాకు అడుగడుగునా అడ్డంకులే
- మెయిన్ కెనాల్‌లో జంగిల్ క్లియరెన్స్‌కు రూ.కోటి నిధులతో అంచనా
- ఖమ్మం సర్కిల్‌లో మొదలు.. కల్లూరులో ఖరారు కాని టెండర్లు

ఖమ్మం అర్బన్: జిల్లాలో సాగునీటికి ప్రధాన ఆధారమైన నాగార్జున సాగర్ ఎడమకాల్వలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ వానాకాలంలో సాగు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం నెలకొంది. జిల్లాలో అధికారికంగా 2.54 లక్షల ఎకరాలు, లిఫ్టుల పరిధిలో ఆయకట్టు కలిపితే మూడు లక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందించాల్సిన ప్రధాన కాల్వలపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో చివరి ఆయకట్టుకు నీరు చేరకపోవచ్చనే ఆందోళన రైతుల్లో పెరుగుతోంది. గతేడాదే ఇబ్బంది పడ్డామని, ఈ సంవత్సరమైనా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి పంటలకు సక్రమంగా నీరందించాలని రైతులు, వివిధ సంఘాల నాయకులు ఇటీవల కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు.

తాత్కాలిక మరమ్మతులతే..

గత వానాకాలంలో పాలేరు నుంచి సాగర్ ప్రధాన కాల్వలో పలు చోట్ల తీవ్రంగా గండ్లు పడినా తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టారు. ప్రధాన కాల్వలతోపాటు బ్రాంచ్, మేజర్, మైనర్ కాల్వల్లో పూడిక పేరుకుపోయి, తూములు, షట్టర్లు ధ్వంసమై, చెట్లు పెరిగి నీరు సక్రమంగా వెళ్లే పరిస్థితి లేదు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా జలవనరుల శాఖ అధికారులు సరైన దృష్టి పెట్టకపోవడం, అంచనాలకు తగ్గట్టుగా నిధులు మంజూరు కాకపోవడంతో రైతులు అసంతృప్తికి లోనవుతున్నారు.

అన్ని చోట్లా అంతే..

కల్లూరు సర్కిల్ పరిధిలోని కల్లూరు, మధిర, సత్తుపల్లి డివిజన్లలో సాగర్ ఎడమ కాల్వ ఆధారంగా పంటలు వేస్తుంటారు. అయితే కాల్వల్లో పూడిక, చెత్త, పిచ్చిమొక్కలు పెరగడంతో చివరి భూములకు నీరందడం లేదు. ఏన్కూరు, కొణిజర్ల, మధిర, తల్లాడ మండలాల్లో కాల్వలు మరీ దయనీయ స్థితిలో ఉన్నాయి. ఏన్కూరు మండలంలోని మేడేపల్లి, రఘునాథపాలెం మండలం మూలగూడెం మధ్య 22 కిలోమీటర్ల మేర కంపచెట్లు ఉన్నాయి. వంతెనలు కూడా శిథిలావస్థకు చేరాయి. రెగ్యులేటర్ షట్టర్లు ధ్వంసమై నీరు బయటకు వెళ్లిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ బ్యాంకు నిధులతో కాల్వలకు ఆధునికీకరణ పనులు చేయగా, ఆ తర్వాత నామమాత్రంగానే పనులు జరగడం, కొత్తగా నిధులు మంజూరు కాకపోవడంతో మరమ్మతుల కోసం నిరీక్షిస్తున్నాయి. మధిర మండలంలో మేజర్ కాల్వల్లో చెట్లు పెరిగి, పూడిక పేరుకుపోయి నీరు పారే పరిస్థితి లేదు. తూములు, షట్టర్లు ధ్వంసమై సాగునీరు వృథాగా వాగుల్లోకి వెళ్తుండగా పంటలు ఎండిపోతున్నాయి. పాలేరు – సాగర్ ప్రధాన కాల్వలో గతేడాది ఏర్పడిన గండ్లకు ఇప్పటికీ పూర్తిగా మరమ్మతులు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే వానాకాలం పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.

రూ.కోటితో ప్రధాన కాల్వ మరమ్మతులు..

సాగర్ ప్రధాన కాల్వ జిల్లా సరిహద్దు నుంచి ఏపీ సరిహద్దు వరకు ఖమ్మం, కల్లూరు సర్కిళ్ల పరిధిలో జంగిల్ క్లియరెన్స్ (కంపచెట్లు తొలిగింపు)యూటీ, హెడ్ వర్క్స్ మరమ్మతులకు రూ.కోటి మంజూరయ్యాయి. ఖమ్మం సర్కిల్‌లో రూ.40 లక్షల విలువైన పనులు సాగుతుండగా, కల్లూరు పరిధిలో రూ. 60 లక్షల విలువైన పనులకు టెండర్ల దశలోనే ఉన్నట్లు తెలిసింది. జంగిల్ తొలగించాక బలహీనంగా ఉన్న కాల్వకట్టలు, పూడికలను గుర్తించి మరమ్మతులు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

పనులు సాగుతున్నాయి..



వరద కారణంగా దెబ్బతిన్న యూటీ మరమ్మతు పనులు వేగంగానే సాగుతున్నాయి. సాగర్ ప్రధాన కాల్వకట్టలపై చెట్ల తొలిగింపు పనులు చేస్తున్నాం. నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.వెంకటేశ్వర్లు ఖమ్మం సర్కిల్ ఎస్ఈ

ఆయకట్టుకు ఇబ్బంది రానివ్వొద్దు



రైతులు సాగు మొదలు పెట్టిన తర్వాత కాకుండా ముందస్తుగానే సాగర్ ఆయకట్టు వరకు నీరందేలా అవసరమైన మరమ్మతులు చేయాలి. కాల్వల్లో చెట్లు పెరగడంతో ఆయకట్టు చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాదైనా ఆ సమస్య లేకుండా చూడాలి.

–బొంతు రాంబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

యూటీ మరమ్మతులు..

గత ఏడాది వరదతో తెగిన యూటీ వద్ద రూ.14 కోట్ల అంచనాలతో పనులు కొనసాగుతున్నాయి. నీటి విడుదల నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఈలోపు వానలు, వరదలు అడ్డంకిగా మారకుంటే పనులు పూర్తవుతాయి. లేదంటే మళ్లీ కష్టాలు తప్పవు. అధికారులు మాత్రం యూటీ మరమ్మతులు జూలై మొదటి వారం కల్లా పూర్తి చేస్తామని అంటున్నారు.



కూసుమంచి వద్ద కొనసాగుతున్న పనులు

ఆదర్శవంతంగా ఏదులాపురం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన అధికారులు, నాయకులు

- మున్సిపాలిటీ పరిధిలోని అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ

ఖమ్మంరూరల్ : నూతనంగా ఏర్పాటైన ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు రహదారుల నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఏడాదిన్నర కాలంగా ప్రభుత్వం పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తూ, ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ పాలన కొనసాగిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పథకాలను అందిస్తున్నామని, తద్వారా పేదలు ఆనందంగా ఉన్నారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్లు ఇచ్చి తీరుతామని హామీ ఇచ్చారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయడం చారిత్రక నిర్ణయమని, ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి పథకం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ యాకోబ్, ఈఈ యుగంధర్, ఆర్డీఓ నర్సింహారావు, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

'రాజీవ్ స్వగృహ' సాధనకు కృషి

టీజీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని గెజిటెడ్ అధికారులకు ఇళ్ల స్థలాలకు బదులు రాజీవ్ స్వగృహ ఫ్లాట్స్ ఇప్పించేలా కృషి చేస్తామని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. ఇందుకోసం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారం తీసుకుంటామని చెప్పారు. ఖమ్మంలోని టీజీఓ కార్యాలయంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏలూరి మాట్లాడారు. ఫ్లాట్స్ కోసం ఇప్పటికే మంత్రులను కలిసి విన్నవించామని తెలిపారు. బ్యాంకు రుణ సదుపాయం కల్పించాలని, హైదరాబాద్‌స్థాయిలో గేటెడ్ కమ్యూనిటీ తరహాలో ఖమ్మంలోని గెజిటెడ్ ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలని కోరినట్లు చెప్పారు. సమావేశంలో హౌసింగ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా కిషోర్, పి.విజయ్‌కుమార్, టీజీఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, టీజీఏసీ జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొణిదన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నీ

విజేతలకు బహుమతుల ప్రదానం

ఖమ్మం స్పోర్ట్స్ : నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ ఆదివారం ముగిసింది. 35 ప్లస్ పురుషుల కేటగిరీ సింగిల్స్‌లో శ్రీను, ఎం.సన్ని, డబుల్స్‌లో నూతన్‌రాజ్, గోపాల కృష్ణ జోడి ప్రథమస్థానంలో నిలువగా, ఎం.నరేష్, శ్రీను ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. 40 ప్లస్ సింగిల్స్‌లో బి.మంగిత్యా, ఈ.శ్రీనివాస్, డబుల్స్‌లో నివాస్‌రెడ్డి, ఈ.శ్రీనివాస్, సంజయ్‌రెడ్డి, సత్యం, 45 ప్లస్ సింగిల్స్‌లో వై.నర్సింహారెడ్డి, రామ్‌చందర్, డబుల్స్‌లో ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, వై.పాపారావు, ఎండి.పర్వేజ్, రామచందర్, 50 ప్లస్ సింగిల్స్‌లో పి.వెంకటేశ్వరరావు, రవి, డబుల్స్‌లో టి.లక్ష్మణ్‌రావు, సైదులు, జె.శ్రీనివాస్, సూరి, 55 ప్లస్ సింగిల్స్‌లో ఎ.సురేష్‌కుమార్, లక్ష్మణ్‌రావు, డబుల్స్‌లో సీహెచ్.నాగుల్, రవి, వి.చందు, పి.శ్రీనివాస్, 60 ప్లస్ సింగిల్స్‌లో ఎన్.రఘు, ఎస్.వెంకటేశ్వర్లు, డబుల్స్‌లో ఎస్.వెంకటేవ్వర్లు, ఎ.వీరభద్రం, కె.వెంకటేశ్వర్లు, ఎస్.డి.ఖాజామొయినొద్దీన్, 65 ప్లస్ సింగిల్స్‌లో బి.కోటేశ్వరరావు, రమేష్, 70 ప్లస్ సింగిల్స్‌లో పి.సత్యనారాయణరావు, పి.భాస్కర్‌రావు, డబుల్స్‌లో పి.భాస్కర్‌రావు, ఎ.సత్యనారాయణ, ఎస్. వెంకటేశ్వరరావు, నర్సింహారావు, 75 ప్లస్ సింగిల్స్‌లో కె.నర్సయ్య, జి.కిషన్‌రావు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు అడిషనల్ ఎస్పీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ జి.వెంకట్రావు, అధ్యక్షుడు కర్నాటి వీరభద్రం, ఉపాధ్యక్షులు దుద్దుకూరి సత్యనారాయణ, కార్యదర్శి వి.చంద్రశేఖర్, మాజీ అధ్యక్షులు సిరిపురపు సుదర్శన్‌రావు, పాటిబండ్ల యుగంధర్ బహుమతులు అందజేశారు.

కార్మికవర్గ ఐక్యతే ఎస్‌డబ్ల్యూఎఫ్ లక్ష్యం

- ఆర్టీసీ పరిరక్షణ, హక్కుల సాధనకు ఉద్యమించండి
- సీఐటీయూ నేత పాలడుగు భాస్కర్



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ఖమ్మంమయూరిసెంటర్ : ఆర్టీసీ కార్మికుల ఐక్యతకు వారధిగా.. పోరాటాల సారథిగా, కార్మికవర్గ ఐక్యతే లక్ష్యంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ పని చేస్తుందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఖమ్మం ఐఎంఏ హాల్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. కార్మికులు ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఆర్టీసీ కార్మికులకు నష్టం కలిగించే ప్రభుత్వ, యాజమాన్య విధానాలకు వ్యతిరేకంగా పోరాడే సంఘం ఎస్‌డబ్ల్యూఎఫ్ ఒక్కటేనని చెప్పారు. సంస్థలో 55 రోజుల పాటు జరిగిన సమ్మెకు సీఐటీయూ అండగా నిలిచిందని గుర్తు చేశారు. ఆర్టీసీని పరిరక్షించేది ఐక్య పోరాటమేనని పిలుపునిచ్చారు. కార్మికులు అనుభవిస్తున్న కష్టాలు, ఆర్టీసీ ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్ విధానాలు, ఎలక్ట్రికల్ బస్సులు, పెరిగిన పనిభారాలు అన్నీ కూడా ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల ఫలితమేనని విమర్శించారు. జూలై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో ఆర్టీసీ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మహాసభలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ఉమెన్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్వీ రమ, ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జాతీయ కార్యదర్శి అర్మిగనాయర్, ఏపీ ఎస్‌డబ్ల్యూఎఫ్ కోశాధికారి దివాకర్, ఆహ్వాన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కళ్యాణం వెంకటేశ్వరరావు, పిట్టల సుధాకర్, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ గడ్డం లింగమూర్తి, ఆర్టీసీ శ్రామిక మహిళా కమిటీ నాయకులు పద్మావతి, వివిధ విభాగాల నాయకులు మాధవరావు, రోశయ్య, పగిళ్లపల్లి నరసింహారావు, గడ్డం వెంకటయ్య, వి.రమేష్, బుగ్గవీటి లింగమూర్తి, భాగ్యలక్ష్మి, మల్లికాంబ, పద్మ, విజయలక్ష్మి, సరిత, సీతారామారావు పాల్గొన్నారు.

కొన్నే భళా.. మరిన్ని డీలా

- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలు అంతంతే
- జిల్లా కేంద్రంలో మాత్రం ఆశాజనకంగా చేరికలు
- మిగతా చోట్ల ఆశించిన స్థాయిలో దక్కని ఫలితం



బాలికల కళాశాలలో చేరిన విద్యార్థినులు

ఖమ్మంసహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో సౌకర్యాలు కల్పించడంతోపాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందిస్తున్నా ఆశించిన స్థాయిలో అడ్మిషన్లు జరగడం లేదు. అధికారులు ఆది నుంచీ ప్రయత్నాలు చేసినా సత్ఫలితాలు రావడం లేదు. పలు కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది గతేడాది చివరి నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో విస్తృత ప్రచారం చేసి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరాలని పదో తరగతి విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు. అయితే ఖమ్మం నగరంలోని మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మాత్రమే అడ్మిషన్లు అధికంగా ఉండగా.. మిగతా చోట్ల మాత్రం అరకొరగానే నమోదయ్యాయి.

1,632 మంది చేరిక..

జిల్లాలో 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా.. ఇప్పటి వరకు 1,632 మంది మాత్రమే ప్రవేశాలు పొందారు. ఇందులో జనరల్ విభాగంలో 1,127, ఒకేషనల్‌లో 505 మంది విద్యార్థులు చేరారు. ఖమ్మంలోని ఏఎస్‌ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాలలో 310 మంది చేరగా.. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 186 మంది, నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 166 మంది, కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 161 మంది, నయాబజార్ జూనియర్ కళాశాలలో 131 మంది ప్రవేశాలు పొందారు. కాగా, గతేడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో శాంతినగర్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులు సాధించి ప్రతిభ చాటారు. దీంతో ఈ కళాశాలకు ఈసారి ఆదరణ లభించినట్లు తెలుస్తోంది.

31 వరకే గడువు..

గత నెల నుంచి ఇంటర్మీడియట్ ప్రవేశాలకు విస్తృత ప్రచారం నిర్వహించిన అధ్యాపకులు.. ఈనెల ఒకటో తేదీ నుంచి కళాశాలలను పునఃప్రారంభించారు. కాగా, ప్రవేశాల గడువు ఈ నెల 31 వరకే ఉంది. జిల్లాలోని 21 కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులతోపాటు ఒకేషనల్‌కు సంబంధించి మొత్తంగా 8,882 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు అవకాశం ఉండగా.. ఇప్పటి వరకు 1,632 మంది మాత్రమే చేరడం గమనార్హం. గతేడాది సుమారు 3,500 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందగా.. ఈసారి అంతమంది విద్యార్థులు చేరే అవకాశం లేదనే చర్చ సాగుతోంది. సమయం గడుస్తున్నా అడ్మిషన్లు మాత్రం ఆశించిన స్థాయిలో పెరగడం లేదు.

అతి తక్కువ ఇక్కడే..

జిల్లాలోని కొన్ని జూనియర్ కళాశాలల్లో చాలా తక్కువ అడ్మిషన్లు నమోదయ్యాయి. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు జూనియర్ కళాశాలలో ఇప్పటి వరకు ఇద్దరే చేరగా.. కామేపల్లి జూనియర్ కళాశాలలో ఐదుగురు, కందుకూరు బండి సీతారత్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 10 మంది, కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 15 మంది, ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 29 మంది, ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు జూనియర్ కళాశాలలో 33 మంది, సత్తుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 48 మంది మాత్రమే చేరారు. మిగతా కళాశాలల్లో 50కి పైగా ప్రవేశాలు జరిగినా కేటాయించిన సీట్లతో పోలిస్తే పావు వంతు కూడా చేరలేదు. అయితే అధికారులు మాత్రం కొన్ని అడ్మిషన్లు ఆన్‌లైన్ చేయాల్సి ఉందని చెబుతుండటం గమనార్హం.

ప్రవేశాలు పెంచేలా చర్యలు



ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు క్షేత్ర స్థాయికి వెళ్లి ప్రచారం చేస్తూ ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇంకా కొన్ని అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉంది.

–రవిబాబు, డీఐఈఓ

ప్రచారం చేస్తున్నాం..



విద్యార్థుల ప్రవేశాలు పెంచేలా ముందు నుంచే అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. దీని ద్వారానే ప్రవేశాల సంఖ్య పెరిగింది. ఇంకా విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వ కళాశాలల్లో అందుతున్న విద్య, పాఠ్యపుస్తకాలు, సౌకర్యాలపై అవగాహన కల్పిస్తూ ప్రవేశాలు పెంచుతున్నాం.

–ఆర్.గోవిందరావు, ప్రిన్సిపాల్, శాంతినగర్ జూనియర్ కళాశాల, ఖమ్మం

శిశువుకు ఆరోగ్య రక్ష

- నేటి నుంచి మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాలు
- మిస్సింగ్, డ్రాపౌట్ చిన్నారులకు వ్యాక్సినేషన్
- 12 రకాల వ్యాధులకు 11 రకాల టీకాలు



శిశువుకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం సోమవారం నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్నారు. 12 రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించేందుకు 11 రకాల టీకాలు వేయనున్నారు. ఈ వ్యాక్సినేషన్ డ్రైవ్ ఈ నెల 30 వరకు కొనసాగనుంది. మిస్సింగ్, డ్రాపౌట్ పిల్లలను గుర్తించి టీకాలు ఇవ్వనున్నారు. గతంలో మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం ద్వారా ఏడు రకాల వ్యాధులకు టీకాలు వేయగా ప్రస్తుతం 12 రకాలకు పెంచారు. పోలియో, టీబీ, డిఫ్తీరియా, పెర్టుసిస్(వూపింగ్ దగ్గు), టెటనస్, పొంగు, రుబెల్లా, హెపటైటిస్ బీ, మెనింజైటిస్, హిమోఫిలస్ ఇన్‌ఫ్లూయెంజా బీ(హెచ్‌ఐబీ), న్యూమోనియా, రోటా వైరస్, గ్యాస్ట్రోంటెరిటిస్ వ్యాధులు సంక్రమించకుండా టీకాలు అందిస్తారు.

టీకాలు వేస్తూ.. అవగాహన కల్పిస్తూ..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం పిల్లల ఆరోగ్యానికి రక్షగా నిలుస్తోంది. సాధారణంగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో నిత్యం ఈ టీకాలు వేస్తుంటారు. పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో ప్రతీ బుధవారం టీకాలు వేస్తారు. మిగతా చోట్ల ప్రతీ శనివారం వేస్తారు. అయితే కొందరు తల్లిదండ్రులు వీటిపై అవగాహన లేక, మరిచిపోయి పిల్లలకు టీకాలు వేయించకుండా ఉంటారు. కాగా, ప్రతి సంవత్సరం మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంతో అలాంటి వారిని గుర్తిస్తూ టీకాలు వేయడంతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు.

గర్భిణులకూ టీకాలు..

జిల్లాలో మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం కోసం డ్రాపౌట్స్, మిస్సింగ్, లెఫ్ట్ ఔట్ శిశువులపై జిల్లా వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఆరా తీస్తున్నారు. ఇప్పటి వరకు 904 మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఈ కార్యక్రమం ద్వారా గర్భిణులకు కూడా టీకాలు వేయనున్నారు. ఇప్పటివరకు 214 మంది గర్భిణులను గుర్తించారు. ప్రత్యేకంగా సంచారజాతులు, మురికి వాడలు, నిర్మాణ ప్రాంతాలు, ఇటుక బట్టీలు, రవాణా సౌకర్యంలేని తదితర ఏరియాలపై దృష్టి పెట్టి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి



మిషన్ ఇంద్రధనుష్ ద్వారా అందించే టీకాలు చిన్నారుల ఆరోగ్యానికి రక్షణ కల్పిస్తాయి. ప్రాణాంతకమైన 12 రకాల వ్యాధులు రాకుండా కాపాడుతాయి. తల్లిదండ్రులు తమ పిల్లలకు నిర్దిష్ట సమయాల్లో సూచించిన టీకాలు వేయిస్తే ఆరోగ్యంగా ఉంటారు. సోమవారం నుంచి నిర్వహించే ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

– రమణ, జిల్లా వ్యాక్సిన్ మేనేజర్

ఏ టీకా ఎప్పుడు..

- శిశువు జన్మించగానే టీబీ రాకుండా బీసీజీ, పోలియో రాకుండా ఓపీవీ, కాలేయ సమస్యలు రాకుండా హెపటైటిస్ బీ టీకా వేస్తారు.
- ఆరు వారాలకు పెంటావాలెంట్, రోటావైరస్, ఓరల్ పోలియో, పీసీవీ, ఐపీవీ టీకాలు ఇస్తారు.
- పది వారాలకు పెంటావాలెంట్, ఓరల్ పోలియో, రోటావైరస్ టీకా ఇస్తారు.
- 14 వారాలకు పెంటా వాలెంట్, రోటావైరస్, ఓరల్ పోలియో, పీసీవీ టీకా వేస్తారు.
- 9 నుంచి 12 నెలల మధ్య మిజిల్స్, రుబెల్లా, జపనీస్ ఎన్‌సఫెలైటిస్, పీసీవీ, ఐపీవీ టీకా ఇస్తారు.
- 16 నుంచి 24 నెలల మధ్య ఎంఆర్, జేఈ, ఓరల్ పోలియో, డీపీటీ టీకా ఇస్తారు.
- 5 నుంచి ఆరేళ్ల మధ్య డీపీటీ బూస్టర్–2
- పదేళ్లకు టెటనస్ అండ్ డిఫ్తీరియా(టీడీ) వ్యాక్సిన్ ఇస్తారు.
- 16 ఏళ్లకు టెటనస్ అండ్ డిఫ్తీరియా(టీడీ) వ్యాక్సిన్ వేస్తారు.
- గర్భిణీలకు టీడీ1, టీడీ2 లేదా టీడీ బూస్టర్ వ్యాక్సిన్ ఇస్తారు.

క్లుప్తంగా

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. ఆ తర్వాత అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవేత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

కూచిపూడి నృత్యంలో చిన్నారి ప్రతిభ



రవీంద్రభారతిలో పురస్కారం అందుకుంటున్న భువనచంద్రిక

ఖమ్మంరూరల్ : మండలంలోని సూర్యనగర్‌కు చెందిన చిన్నారి గండికోట భువనచంద్రిక కూచిపూడి నృత్యంలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చింది. శని, ఆదివారాల్లో హైదరాబాద్‌లో జరిగిన నృత్య పోటీల్లో పాల్గొన్న భువన.. మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో బాసర సరస్వతి అమ్మవారి అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా భువనను పలువురు అభినందించారు.

మధిర - విజయవాడ బస్సు సర్వీస్ షురూ

మధిర: మధిర డిపో పరిధిలోని జమలాపురం నుంచి వైలవరం మీదుగా విజయవాడకు నూతన బస్సు సర్వీస్‌ను సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు మధిర డిపో మేనేజర్ డి.శంకర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం మూడు ట్రిప్పులు సర్వీస్ ఉంటుందని, మధిర నుంచి ఉదయం 6, 11 గంటలకు, సాయంత్రం 4 గంటలకు బయలు దేరుతుందని, విజయవాడ నుంచి ఉదయం 8.30,మధ్యాహ్నం 1.30, సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరుతుందని వివరించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

చింతకాని: మండలంలోని నాగులవంచ సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ఏపీలోని చిల్లకల్లు, చిట్యాల దేవాలయాల్లో పనిచేస్తున్న పూజారి వెంకటేశ్‌కు గాయాలయ్యాయి. వెంకటేశ్ ద్విచక్ర వాహనంపై ఖమ్మం వస్తుండగా నాగులవంచ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. గాయపడిన ఆయన్ను 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గంజాయి పట్టివేత

ఖమ్మంక్రైం: నగరంలోని త్రీటౌన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ మోహన్‌బాబు కథనం ప్రకారం.. అగ్రహారం కాలనీకి చెందిన రాయల భోగి అలియాస్ యోగి, దానవాయిగూడెం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లల్లో నివసించే బానోత్‌సాయి కలిసి బైక్‌పై వెళ్తుండగా.. మోతీనగర్ పార్కు వద్ద పోలీసులు తారసపడ్డారు. దీంతో వారు పారిపోయేందుకు యత్నించగా పోలీసులు వెంబడించి పట్టుకుని, తనిఖీ చేయగా 200 గ్రాముల గంజాయి దొరికింది. వారిద్దరు అగ్రహారం కాలనీలో ఉండే నాగేంద్రబాబు (పండురు) నుంచి కొన్ని రోజుల కిందట 300 గ్రాముల గంజాయి కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది. వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని సీఐ వివరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,748

ఇక నిశ్చింతగా ఉండేలా..

ఒకప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకులాల్లో చేర్పించాక ఇంటిబాట పట్టిన సమయాన వారితో కనీసం మాట్లాడటానికి ఫోన్ కూడా లేదని ఎంతో మదనపడేవారు. అలాగే విద్యార్థులు సైతం తల్లిదండ్రుల సమాచారం కోసం బెంగపడేవారు. కొందరు అక్కడ ఉండలేక ఇంటిబాట పట్టిన సందర్భాలు ఉన్నాయి. అయితే కాలానుగుణంగా ప్రభుత్వం గురుకులాల్లో నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య, వసతి సౌకర్యం కల్పించి నాణ్యమైన బోధన అందించడంతో పాటు విద్యార్థుల యోగక్షేమాలు, ఇతర విషయాలను తల్లిదండ్రులకు చేరవేసేందుకు ఫోన్‌మిత్ర పేరిట ఫోన్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి ప్రతీ విద్యార్థికి ఒక కాలింగ్ కార్డు ఇవ్వనుంది. – నేలకొండపల్లి

'ఫోన్‌మిత్ర' పేరిట గురుకులాలలో ఫోన్ సౌకర్యం

- ఇందుకు విద్యార్థులకు కాలింగ్ కార్డుల అందజేత
- తీరిన తల్లిదండ్రుల బాధలు
- ఉమ్మడి జిల్లాలో 34 గురుకులాల్లో ఏర్పాటు



గురుకులంలో ఫోన్ మాట్లాడుతున్న విద్యార్థులు

కుటుంబీకులతో మాట్లాడేలా..

ఖమ్మం ఉమ్మడి జిల్లాలో మొత్తం 34 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు ఉండగా వాటిలో 9 బాలుర, 25 బాలికల పాఠశాలలు ఉన్నాయి. అయితే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఇటీవల ప్రత్యేకంగా ఫోన్ సౌకర్యాన్ని కల్పించింది. తొలిసారిగా ఇంటిని వదిలి గురుకులాల్లో చేరే వారు ఒత్తిడికి గురవుతుంటారు. ఒంటరిగా ఉన్నామని బాధపడుతుంటారు. వీరి బాధలను గుర్తించిన సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించి ఫోన్‌మిత్రను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇకనుంచి విద్యార్థులు తమ తల్లిదండ్రులతో ఎప్పుడైనా మాట్లాడే అవకాశం ఉండనుంది.

ప్రతీ విద్యార్థికి కాలింగ్ కార్డు..

ప్రతీ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టెలిఫోన్ బాక్స్‌లను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు కాలింగ్ కార్డులను కేటాయించారు. దీని ద్వారా ముందుగా నమోదు చేసుకున్న తల్లిదండ్రులు, సంరక్షకులకు ఉచితంగా కాల్స్ చేసుకోవచ్చు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన పిల్లల యోగక్షేమాలను తెలుసుకోవచ్చు.

అధికారుల దృష్టికి..

గురుకులాలలో ఏర్పాటు చేసిన ఫోన్ సౌకర్యం కేవలం ఫోన్ చేసుకోవడానికే కాదు.. విద్యార్థులకు ఒక సైకాలాజికల్ సేఫ్టీ నెట్‌గా ఉపయోగపడనుంది. కార్డులో ఏఐ ఆధారిత చాట్ బాక్స్‌తో ఉన్న నంబర్ ఆధారంగా ఏమైనా సమస్యలు, ఫిర్యాదులు, సూచనలు ఉంటే సంబంధిత అధికారికి నేరుగా సందేశం పంపవచ్చు. లేదంటే సొసైటీ ప్రధాన కార్యాలయంలోని కాల్ సెంటర్‌కు ఫోన్ వెళ్తుంది. తద్వారా సమస్యలు సులభంగా పరిష్కరించుకోవచ్చు.

విద్యార్థుల శ్రేయస్సు కోసం..



విద్యార్థులు ఇంట్లో ఉన్న భావన కల్పించేందుకు ఫోన్ మిత్ర ఉద్దేశం. ఇంటికి దూరంగా ఉండడం వలన కాస్త ఆందోళన చెందుతున్న తరుణాన తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం కల్పించాం. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నాం.
– స్వరూపరాణి, గురుకులాల జోనల్ అధికారి, భద్రాద్రి కొత్తగూడెంజోన్

చాలా బాగుంది..



ఫోన్‌మిత్ర సౌకర్యం చాలా బాగుంది. ఇక్కడ చేరిన కొత్తలో ఇంటికి దూరంగా ఉంటున్నామనే బాధ ఉండేది. కుటుంబసభ్యులతో మాట్లాడలేకపోతున్నామని బెంగగా ఉండేది. ఇప్పుడది లేదు. సమాచారాన్ని సులువుగా పేరెంట్స్‌కు చెప్పగలుతున్నాం.
– సీహెచ్.సాహితీ, విద్యార్థిని, నేలకొండపల్లి గురుకుల పాఠశాల

ఇక బెంగతీరింది..



గురుకులాల్లో ఉంటున్న మా పిల్లల సమాచారం తెలుసుకునేందుకు గతంలో ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు ఆ బాధ, భయం లేదు. ఎప్పటికప్పుడు వారి యోగక్షేమాలు, చదువు విషయాలను తెలుసుకుంటున్నాం. మా పిల్లలు అవసరమైనప్పుడు ఫోన్ చేస్తున్నారు.
– బి.నాగరాణి, విద్యార్థిని తల్లి, కోనాయిగూడెం

మాఢవీధుల విస్తరణకు చిక్కుముడి



మాఢ వీధుల విస్తరణలో కూల్చివేయని భవనాలు

- భద్రాచల రామాలయ అభివృద్ధికి ఆటంకం!
- స్థలాలు ఇచ్చేందుకు అంగీకరించని రెండు కుటుంబాలు
- భూ సేకరణ పూర్తయితేనే పనులు ప్రారంభం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానం అభివృద్ధికి చేపట్టిన మాఢ వీధుల విస్తరణకు అడ్డు తొలగడం లేదు. దాదాపు అందరూ ఖాళీ చేసినా ఓ రెండు కుటుంబాల పేచీతో భూ సేకరణ పూర్తి కాలేదు. భూ సేకరణ పూర్తయితేనే రామాలయ అభివృద్ధి పనులు ముందుకు సాగుతాయి. దీంతో భక్తులకు ఎదురుచూపులు తప్పడంలేదు.

మేము నష్టపోయామంటున్న నిర్వాసితులు

ప్రభుత్వంపై నమ్మకంతో రామాలయ అభివృద్ధికి సహకరించేందుకు ఆలయానికి పడమర, దక్షిణం వైపున ఉన్న చిరు వ్యాపారులు, ఇళ్ల యజమానులు గత నెల 10వ తేదీ తర్వాత ఖాళీ చేశారు. నష్ట పరిహారం పూర్తిగా అందించలేదని, ప్రత్యామ్నాయఇంటి స్థలం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తూనే తమ నివాసాలను ఖాళీ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. వారు జేసీబీలతో ఇళ్లను కూల్చేశారు.నెల రోజులు దాటినా ఇతర ఇళ్లను ఖాళీచేయించలేదు. దీంతో తాము వ్యాపారం నష్టపోయామనిఖాళీ చేసిన నిర్వాసితులు పేర్కొంటున్నారు.

పుష్కరాల నాటికైనా అవుతాయా..?

రామాలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అంటున్నా ప్రభుత్వ చిత్తశుద్ధిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సుమారు 18 నెలలు కావొస్తున్నా అభివృద్ధిలో కీలక ఘట్టమైన మాఢ వీధుల విస్తరణ భూ సేకరణకే నెలలపాటు సమయం తీసుకోవడంపై భక్తులు పెదవి విరుస్తున్నారు. భూ సేకరణ పూర్తయి, మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వం ఆమోదించి, విడతలవారీగా బడ్జెట్ విడుదలైతేనే పనులు పూర్తవుతాయి. ఆ పనులన్నీ అయ్యేదెప్పుడు.. ఆలయం అభివృద్ధి చెందేదెప్పుడనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కనీసం గోదావరి పుష్కరాల నాటికైనా ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేస్తారా అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి భూ సేకరణ పూర్తి చేసి నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

రెండు కుటుంబాలతోనే సమస్య

రామాలయ అభివృద్ధికి ప్రధానమైన మాఢ వీధుల విస్తరణపై ప్రభుత్వం తొలుత దృష్టి సారించింది. 40 ఇళ్లను తొలగించాలని నిర్ణయించిన అధికారులు సంప్రదింపులు జరిపి 32 మందికి నష్టపరిహారం కొంత అందజేశారు. ఇళ్లు తొలగించారు. ఆ తర్వాత మరికొంత పరిహారం చెల్లించగా ఇంకా సుమారు 25 శాతం పరిహారం చెల్లించాల్సి ఉంది. ప్రత్నామ్నాయ ఇంటి స్థలాన్ని కూడా చూపించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో దాదాపు అందరూ ఖాళీ చేసినా రెండు కుటుంబాలకు చెందిన ఎనిమిది మంది మాత్రం ససేమిరా అంటున్నారు. ఆలయంలో పనిచేసే ఓ ప్రధానార్చకుడితోపాటు కొందరు వ్యాపారులు అంగీకరించడం లేదు. రోడ్డు భవనాల శాఖ నిర్దేశించిన మేర కాకుండా పెద్ద మొత్తంలో నష్టపరిహారాన్ని వారు ఆశిస్తున్నట్లు తెలిసింది. చివరకు రెవెన్యూ అధికారులు 2013 చట్టం ప్రకారం ఇవ్వడానికి అంగీకరించినా అది కూడా సరిపోదంటూ వారు కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. ఇటు రెవెన్యూ అధికారులు సైతం సీసీఎల్ కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలుస్తోంది. న్యాయస్థానం ఆదేశాల ప్రకారం నష్టపరిహారాన్ని కోర్టులో డిపాజిట్ చేసి ఆ ఇళ్లను సైతం స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

యాదవులను నిర్లక్ష్యం చేయొద్దు..



అభివాదం చేస్తున్న యాదవ మహాసభ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: యాదవులను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పక తప్పదని అఖిలభారత యాదవ మహాసభ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న రామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో మేకల నాగేశ్వరరావు అధ్యక్షతన జిల్లా గొర్రెల పెంపకందారుల సంఘం సమావేశం నిర్వహించగా అఖిల భారత యాదవ మహాసభ గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబుయాదవ్ మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే గొర్రెల పథకాలు వచ్చాయని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో యాదవులకు సముచిత స్థానం దక్కుతుందనే ఆశలో ఉన్నామన్నారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనర్సయ్య, జిల్లా యాదవ యువజన సంఘం అధ్యక్షుడు చిత్తారు సంహాద్రి మాట్లాడారు. సమావేశంలో యాదవ సంఘాల ప్రతినిధులు పుచ్చకాయల వీరభద్రం, చిన్నం మల్లేశ్, పగడాల మధు, దుబాకుల శ్రీనివాస్, అల్లిక అంజయ్య, మల్లెబోయిన ఉపేందర్, మంద నాగేశ్వరరావు, మేకల సైదులు, మెండె వెంకటేశ్, గోపిరాజు యాదవ్, వర్లబోయిన నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే దర్బార్‌లో గిరిజనులు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయాలని పేర్కొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేషపూజలు

పాల్వంచరూరల్: మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరపగా, క్యూలైన్ ద్వారా భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు రుద్రహోమం

పెద్దమ్మతల్లి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా సోమవారం రుద్ర హోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని, వివరాలకు 6303408458 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మొరాయించిన స్పీడ్ బోటు

కిన్నెరసాని జలాశయం మధ్యలో పర్యాటకుల ఆందోళన



కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: పర్యాటకులు ఆదివారం జల విహారం చేస్తుండగా స్పీడ్ బోటు కిన్నెరసాని రిజర్వాయర్ మధ్యలో మొరాయించింది. జలాశయంలో మొసళ్ల సంచారం ఉండటంతో పర్యాటకులు తీవ్ర ఆందోళన చెందారు. నెల క్రితమే బోటుకు మరమ్మతులు చేపట్టినా ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తి నిలిచిపోయింది. డ్రైవర్ మరమ్మతులు నిర్వహించగా తిరిగి స్టార్ట్ కావడంతో పర్యాటకులు ఊపిరి పీల్చుకున్నారు.

ఒక రోజు ఆదాయం రూ. 50 వేలు...

కిన్నెరసానికి పర్యాటకుల రాకతో ఆదివారం ఒక్క రోజూ రూ. 50 వేల ఆదాయం సమకూరింది. రాష్ట్రంలోని పలుప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన సందర్శకులు డ్యామ్, జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ప్రకృతి అందాలను ఆస్వాదించారు. 684 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.36,090 ఆదాయం లభించింది. 250 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.14,040 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కొరవడిన పర్యవేక్షణ

బోటింగ్ పాయింట్ వద్ద టూరిజం కార్పొరేషన్ మేనేజర్ నిత్యం పర్యాటకుల భద్రతను పర్యవేక్షిస్తుంటారు. ఆదివారం మేనేజర్ విధులకు రాలేదు. స్పీడ్ బోటు జలాశయం మధ్యలో నిలిచిపోవడంతో బోటింగ్ సమస్యపై ఎవరికీ ఫిర్యాదు చేయాలో అర్థం కాలేదని పలువురు పర్యాటకులు పేర్కొంటున్నారు. అనంతరం కొందరు ఏజీఎంకు సమస్యను విన్నవించారు. ఈ విషయమై మేనేజర్ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా.. అనారోగ్య సమస్యలతో విధులకు రాలేదని తెలిపారు.

బ్లాస్టింగ్‌తో ఉలిక్కిపడిన చెన్నారంవాసులు



ఓ ఇంట్లో పడిన రాయి

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారం గ్రామంలో పొలాల్లోని బండరాళ్లను బ్లాస్టింగ్ చేయగా పరిసర ప్రాంతంలోని ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఆదివారం పరిసర ప్రాంత ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బ్లాస్టింగ్ చేయడంతో ప్రజలు ఏంజరుగుతుందో తెలియక ఆందోళన చెందారు. పెద్ద బండ రాళ్లు ఇళ్లపై పడ్డాయి. గంజికుంట్ల వరలక్ష్మికి తృటిలో ప్రమాదం తప్పింది. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మృతుడి కుటుంబానికి పరిహారం అందజేత



వెంకన్న కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న రమేశ్

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల గ్రామానికి చెందిన మేక వెంకన్న విద్యుదాఘాతంతో మృతి చెందగా.. ఆయన కుటుంబానికి రూ.5 లక్షల పరిహారాన్ని ఆదివారం అందించారు. వెంకన్న 2024 నవంబర్ 21న విద్యుదాఘాతంతో మృతి చెందగా విద్యుత్ శాఖ నుంచి నష్ట పరిహారం మంజూరైంది. చెక్కును మాజీ సర్పంచ్ రమేశ్ అందించారు.

ఇరాన్‌పై దాడి హేయమైన చర్య

ఖమ్మంమయూరిసెంటర్: మధ్య ప్రాచ్యంలో ఆధిపత్యం కోసం ఇజ్రాయిల్‌కు అండగా ఉంటూ అమెరికా నేరుగా ఇరాన్‌పై దాడి చేయడాన్ని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ తీవ్రంగా ఖండిస్తోందని, ఇది హేయమైన చర్య అని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది యుద్ధ ఉన్మాద దురాక్రమణ చర్య అని, ఇరాన్ సార్వభౌమాధికారంపై దాడి అని స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో ఆధిపత్యం కోసం అమెరికా ఎన్నో ప్రత్యక్ష, పరోక్ష యుద్ధాలు చేస్తోందని, పాలకులను అనుకూలంగా మార్చుకుంటోందని, స్వతంత్రంగా వ్యవహరించే వారిని హతమారుస్తోందని ఆరోపించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

ఏన్కూరు: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని టీఎల్ పేటలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామవాసి షేక్ సైదులుకు చెందిన ఎద్దు పొలంలో మేత మేసేందుకు వెళ్లి.. అక్కడే తెగి పడి ఉన్న 11 కేవీ విద్యుత్ వైరును తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్‌శాఖ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. కాగా, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

నీటి చుక్క నిలవక..

మైదానాన్ని తలపిస్తున్న పెదవాగు ప్రాజెక్ట్





పచ్చదనంతో నిండిన పెదవాగు ప్రాజెక్ట్ (ఇన్‌సెట్) గతేడాది జూన్ నెలాఖరులో కళకళలాడుతున్న పెదవాగు ప్రాజెక్ట్

వానాకాలం సీజన్‌లో ఏటా సాగునీటితో నిండే పెదవాగు ప్రాజెక్ట్ ఈ ఏడాది మాత్రం పచ్చదనం పర్చుకుంది. గతేడాది జూలై 18న కురిసిన భారీ వర్షాలతో అశ్వారావుపేట మండలంలోని గుమ్మడవల్లివద్ద ఉన్న ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఆనకట్టకు భారీ గండి కోతకు గురైంది. ఈ ఏడాది వానాకాలం సీజన్‌కు ముందే ప్రాజెక్ట్‌ను తిరిగి నిర్మిస్తామని పాలకులు హామీ ఇచ్చారు. వరద ఉధృతికి ఆనకట్ట కొట్టుకుపోయినట్లే ఆ హామీ కూడా కొట్టుకుపోయి గోదారిలో కలిసింది. దీంతో ప్రాజెక్ట్‌లో సాగు నీరు నిలవక పచ్చదనంతో నిండి క్రికెట్ మైదానంలా కనిపిస్తోంది. మరోవైపు ఆయకట్టు రైతులు సాగునీటి కోసం మనోవేదన చెందుతున్నారు.
–అశ్వారావుపేటరూరల్